క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి


స్వామిని దర్శించుకుంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం నిర్వహించిన సుదర్శన నారసింహ మహాయజ్ఞాన్ని శుక్రవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తిలకించారు. యజ్ఞశాలలో అధిష్ఠంపజేసిన వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులతో పాటు అంతరాలయంలోని స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు.

అప్పన్న సన్నిధిలో మాడుగుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అనురాధ


కొండదిగువన అనురాధను సత్కరిస్తున్న సింహగిరి వర్తకులు

సింహాచలం: వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ శనివారం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నా రు. దర్శనానికి వచ్చిన ఆమెను కొండదిగువన సింహగిరి వర్తక సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్, కోశాధికారి దొంతల శంకర్, వర్తకులు బంటుబిల్లి సురేష్, ఎస్.చిన్నారావు, కస్తూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

17 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: ఫార్మాసిటీ కాలనీ, పరవాడలో ఇద్దరి నుంచి 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. ఫార్మాసిటీ కాలనీకి చెందిన మోపాడ శ్రీనుబాబును10 మద్యం సీసాలతో.. పరవాడ గ్రామానికి చెందిన పెద్దింటి సునీల్ నుంచి 7 డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

బొగ్గు లారీలతో కాలుష్యకాటు

పరవాడ: బొగ్గు లారీలు నిబంధనలకు విరుద్ధంగా తిరగడంతో ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పాటు కాలుష్యం పెరుగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. బొగ్గు లారీల వల్ల జరుగుతున్న ప్రమాదాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించక పోవడంతో తాజాగా లంకెలపాలెంలో బొగ్గు లారీ ప్రమాదం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక లోడుతో నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైల్వే నుంచి రూ.2.58 కోట్ల పన్ను వసూలు


పన్ను వసూలు రసీదును జెడ్సీ కృష్ణకు అందిస్తున్న ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5కు రైల్వే నుంచి రూ.2.58 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్లు(రెవెన్యూ) బాబూరావు, రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం విశాఖ రైల్వే నుంచి పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను వసూలు చేసి జ్ఞానాపురంలోని కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణకు అందజేశారు. రెవెన్యూ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ నెల 31వ తేదీ రాత్రి 7 గంటల వరకు ప్రభుత్వ 5 శాతం రాయితీతో ఇంటి పన్ను చెల్లించవచ్చు.

రూ.3 లక్షల స్వాధీనం

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్‌గేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద శనివారం నాగరాజు అనే వ్యక్తి నుంచి రూ.3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్యామలరావు, సిబ్బందితో కలిసి శనివారం ఇక్కడ తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ నగదు పట్టుబడింది. నగదును సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించినట్లు సీఐ పిన్నంటి రమణ తెలిపారు. పట్టుబడిన వ్యక్తి కుటుంబ సభ్యులతో కలసి కారులో విజయనగరం నుంచి అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయానికి వెళ్తున్నారు. అక్కడ అవసరాలకు ఈ నగదు తీసుకెళ్తున్నట్లు చెప్పినప్పటికీ.. సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ వెల్లడించారు.


సుందరంగా రత్నగిరినగర్‌లోని స్పోర్ట్స్ థీమ్ పార్కు


ఓపెన్ జిమ్ ఉన్న విశాలమైన సత్యానగర్ పార్కు

రండి..వ్యాయామం చేద్దాం

- పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- వ్యాయామ పరికరాలు సిద్ధం
- సర్వాత్రా హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పెందుర్తి: గత ప్రభుత్వంలో కాలనీల్లో పార్కులు తుప్పలు.. డొంకలతో నిండి ఉండేవి. కాలనీ వాసులు ముందుకు వచ్చి పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసుకుంటే ఆ పార్కుల్లోనే పిల్లలకు ఆటవిడుపు. పెద్దలకు సాయంత్రం పూట కాస్త కాలక్షేపం..అంతకు మించి పార్కుల్లో చూడ్డానికి ఏమీ లేని పరిస్థితి.

పార్కులకు మహర్దశ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించింది. అసాంఘిక కార్యకలాపా లకు అడ్డాగా ఉన్న వాటి స్వరూపం మార్చింది. రూ.కోట్ల నిధులు జీవీఎంసీ ద్వారా విడుదల చేసి జీవీఎంసీ జోన్–8లో పార్కులను అత్యాధునికంగా తీర్చిదిద్దింది. ఈ క్రమంలో ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. జీవీఎంసీ ద్వారా పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా జిమ్ సామగ్రి అమర్చారు. దీంతో ప్రజలు తమ అనుకూలమైన సమయంలో వ్యాయామాలు చేసుకుని ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. చిన్నా పెద్దా అని తేడా లేకుండా వ్యాయమాలు చేస్తున్నారు. వారాంతాల్లో పిల్లలు ఉత్సాహంగా గడుపుతున్నారు.


సత్యానగర్‌లో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు


సుజాతనగర్ బి–జోన్ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు

శరవేగంగా..

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం జీవీఎంసీ విలీన కాలనీల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రజల ఆసక్తిని, అవసరాన్ని గుర్తించి జీవీఎంసీ అధికారులు పార్కుల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. పార్కు/ప్రత్యేక స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కనీసం రూ.5 లక్షలతో జిమ్ పరికరాలు.. పిల్లలకు క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు. మరోవైపు వీటి నిర్వహణ బాధ్యతలను ఐదేళ్లపాటు సదరు కాంట్రాక్టర్‌కే అప్పగించారు. దీంతో ఓపెన్ జిమ్‌లలో పరికరాలు మరమ్మతులకు గురైనా వెంటనే సమస్య పరిష్కరిస్తున్నారు.

- జీవీఎంసీ 97వ వార్డు సత్యానగర్, ఎస్సీబీసీ కాలనీల్లో రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు.
- సుజాతనగర్ పరిసర ప్రాంతాల్లో నాలుగు పార్కుల్లో మొత్తం రూ.25 లక్షల వరకు నిధులు విడుదల చేసి ఓపెన్ జిమ్ సౌకర్యం కల్పించారు.
- చినముషిడివాడ వుడాకాలనీలో రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశారు.
- షిప్‌యార్డ్ లేఅవుట్, మైత్రీనగర్, అప్పన్నపాలెం, గోశాల కూడలి, భరత్‌నగర్‌లలో ఒక్కో జిమ్‌కు రూ.5 లక్షల వరకు జీవీఎంసీ కేటాయించింది. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఓపెన్ జిమ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి.
- రత్నగిరినగర్‌లో స్పోర్ట్స్ థీమ్ పార్కు ఏర్పాటుకు రూ.1.98 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఈ పార్కు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంది.

జోరుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు అడవివరంలోని చింతచెట్టు ఏరియా నుంచి ఘాట్‌రోడ్డు ఏరియా వరకు శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని, భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే మరింత సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, నాయకులు లండ శ్రీను, బొట్టా శ్రీను, మధురెడ్డి, లండ భాస్కర్, బోర కృష్ణారెడ్డి, మజ్జి అప్పలరమణ, మజ్జి ధర్మా, రచ్చవర్మ, ఎస్.అప్పారావు, సంపంగి శ్రీను,లండ రమేష్, రెడ్డి, దమ్ము ఎర్రాజీరావు తదితరులు పాల్గొన్నారు.


అడవివరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

శరవేగంగా అర్బన్ హౌసింగ్ నిర్మాణాలు


పైడివాడ అగ్రహారం అవుట్‌లో తుదిదశకు చేరుకోన్న గృహ నిర్మాణాలు


ఏర్పాటు చేస్తున్న సీసీ డ్రైన్,రోడ్

సబ్బవరం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మండలంలో అర్బన్ హౌసింగ్ గృహ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పైడివాడ అగ్రహారంలో ఏర్పాటు చేసిన మెగా లే అవుట్‌లో ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు 10,500 గృహ నిర్మాణాలు చేపడుతున్న ఈ లేఅవుట్‌లో ప్రభుత్వమే గృహ నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనుంది.ఓ సంస్థ నిర్మాణ పనులు చేపట్టింది.ఇప్పటికే ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అధికారులు అందజేశారు. ఇంటి స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుండగా మరో పక్క రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చేతుల మీదుగా దపదఫాలుగా పంపిణీ చేశారు.ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే ఇళ్ల నిర్మాణాలు పూర్తికావస్తుండటంతో పాటు ఈ లే అవుట్‌లో అన్నిరకాల మౌలిక వసతుల కల్పన జరుగుతోంది. భూములు ఇచ్చిన రైతులకు పరిహారంగా అందజేసే రీ కన్‌స్ట్రక్టడ్ ప్లాట్‌లలో సైతం సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే సీసీ డ్రెన్లు,రోడ్లు,విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు.

పింఛన్ల పంపిణీ నిర్ణయంపై పునః పరిశీలించాలి

- వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకోవాలి
- న్యాయవాది కాళిదాసు రెడ్డి



విశాఖ లీగల్: వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు నాయుడు, మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ ఫిర్యాదుపై పలువురు న్యాయవాదులు విస్మయం చెందారు. పేద, బడుగు బలహీన వర్గాలు,వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి నెలనెలా ఒకటో తేదీన పెన్షన్లు వలంటీర్లు పింఛన్లు అందిస్తూ వారికి ఆసరాగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయొద్దని ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి సీనియర్ న్యాయవాది వి.కాళిదాసు రెడ్డి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ అతి ప్రాచీనమైనదని పేర్కొన్నారు. 1977లో అప్పటి జనతా ప్రభుత్వం దేశవ్యాప్తంగా వలంటీర్ల ద్వారా ఆరోగ్య, సామాజిక సేవలు అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సామాజిక కార్యకర్త పేరుతో గ్రామాల్లో ప్రభుత్వ, వైద్య సేవలు, అందించడానికి ఈ వలంటీర్ వ్యవస్థ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ సేవలను మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునర్ వ్యవస్థీకరించి ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకున్నారని చెప్పారు. లక్షలాదిమంది వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడే అవకాశం ఉన్న దృష్ట్యా ఎన్నికల కమిషన్ తమ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కాళిదాసు రెడ్డి కోరారు.

‘ఉక్కు’ ప్రైవేటీకరణతో నిర్వాసితులకు నష్టం

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం జరుగుతుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. వారితో పాటు ప్లాంట్ కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1143వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షల్లో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు.



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు పరిశ్రమను కేంద్రప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. కార్మికులు పట్టు వదలకుండా ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

హనుమత్ వాహనంపై నృసింహుడు


హనుమత్ వాహనంపై అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా శనివారం సాయంత్రం స్వామికి హనుమత్ వాహనంపై తిరువీధి విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను అలంకరించి హనుమత్ వాహనంపై అధిష్ఠంపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి అట్టహాసంగా నిర్వహించారు. తిరువీధిలో భక్తులు స్వామిని దర్శించుకుని పులకించిపోయారు. ఈ సంతర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనలు అలరించాయి. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎన్నో ఏళ్ల తర్వాత...

ఎన్నో ఏళ్ల తర్వాత శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హనుమత్ వాహనంపై కనువిందు చేశారు. అప్పట్లో హనుమత్ వాహనంపై స్వామికి తిరువీధి జరిగేదని వైదికులు చెప్పడమే తప్పా హనుమత్ వాహనంపై స్వామికి తిరువీధి నిర్వహించిన సందర్భం ఇప్పటి వరకూ లేదు. స్వామికి జరిగే నిత్య ఉత్సవాలు, వార్షిక ఉత్సవాలు, ప్రత్యేక ఉత్సవాల్లో కూడా హనుమత్ వాహనంపై తిరువీధి నిర్వహించలేదు. నృసింహ సుదర్శన మహా యజ్ఞం సందర్భంగా మళ్లీ హనుమత్ వాహనంపై స్వామిని తిలకించే భాగ్యం భక్తులకు దక్కింది.

చురుగ్గా ఆధునికీకరణ పనులు


నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

సబ్బవరం: మండల పరిషత్ కార్యాలయం కొత్త రూపు సంతరించుకుంది. సమావేశ మందిరం అదనపు ఫ్లోర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.25 లక్షల జాతీయ అవార్డు నిధులతో ఈ పనులు చేపట్టారు. సబ్బవరం మండల పరిషత్‌కు ఉత్తమ జాతీయ పురస్కారం లభించడంతో వచ్చిన నిధులతో కార్యాలయానికి నూతన హంగులు కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా శిథిలమైన కార్యాలయ ప్రధాన ఆర్చి, గేట్ తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు.

మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మండల వ్యవసాయ కేంద్రం, మండల ఇంజినీరింగ్ కార్యాలయం,మండల విద్యావనరుల కేంద్రం,ఇరిగేషన్,ఎస్ఆర్ఈజీఎస్,హౌసింగ్,వెలుగు కార్యాలయాలు ఉన్నాయి. మండల పరిషత్ ప్రాంగణంలోని ఈ ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ అనుసంధానం చేసేవిధంగా సుమారు రూ.9 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు వేశారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝురి


యజ్ఞశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న రుత్వికులు


యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలు

- నాలుగో రోజు వైభవంగా నృసింహ మహా యజ్ఞం
- భక్తజన సంద్రంగా మారిన సింహగిరి

సింహాచలం: సింహగిరిపై ఆధ్యాత్మిక వైభవంగా ఉట్టిపడుతోంది. లోక కల్యాణార్థం చేపట్టిన సుదర్శన నారసింహ మహాయజ్ఞం నాలుగోరోజు శనివారం వైభవంగా కొనసాగింది. యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలతో పాటు స్వామి దర్శనానికి వచ్చిన భక్తజనంతో సింహగిరి కిటకిటలాడింది. యజ్ఞ ప్రాంగణం వేద ఘోషతో మార్మోగింది. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను ఒక పల్లకిలో, చక్రపెరుమాళ్‌ను వేరే పల్లకీలో అధిష్ఠంపజేసి ఆలయ ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న యజ్ఞశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చి అధిష్ఠంపజేశారు. ఉభయదాతలకు కంకణధారణ చేసిన అనంతరం వేద మంత్రోచ్ఛరణలు పటిస్తూ యజ్ఞశాలలో ఐదు హోమకుండాల వద్ద యజ్ఞం నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో పూర్ణాహుతి అనంతరం ప్రసాదాన్ని యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలకు, భక్తులకు అందజేశారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తుల చెంతన రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్ర నామం, దివ్యప్రభంద పారాయణం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకంను వైదికులు పఠించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున కుటుంబసమేతంగా, దేవదాయశాఖ ఏడీసీ కె.రామచంద్రమోహన్ సతీసమేతంగా యజ్ఞంలో పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన నిర్వహించారు. బాలభోగం అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వదర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద, మజ్జిగ వితరణ చేపట్టారు.

సందడిగా ఫేర్‌వెల్ డే


డ్యాన్స్ చేస్తున్న ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని వంగలి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలను శనివారం విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. 8వ తరగతి విద్యార్థులకు మిగిలిన విద్యార్థులంతా కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాలలో 8వ తరగతి పూర్తికావడంతో సమీపంలోని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతిలో చేరనున్నారు. వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మధ్యాహ్న భోజన పథక కార్మికులకు చీరలు అందజేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మెన్ లగిశెట్టి దేముడు బాబు,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

5న జాప్ ఉగాది సంబరాలు

దాబాగార్డెన్స్: జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) ఆధ్వర్యంలో వచ్చే నెల 5న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉగాది సంబరాలు నిర్వహించనున్నా రు. ఈ మేరకు యూనియన్ నాయకు లు శనివారం జీవీఎంసీ కమిషన్ సాయికాంత్ వర్మను కలిసి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జాప్ అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాస్, యూని యన్ ప్రధాన కార్యదర్శి కీర్తన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్


యువకుడు ఖయ్యుమ్‌తో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతున్న ఓ యువకుడిని లైఫ్‌గార్డ్స్ కాపాడారు. వివరాలిలా.. హైదరాబాద్‌కు చెందిన 11 మంది యువకులు శనివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులందరూ అక్కడ ఎంజాయ్ చేసి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో ఖయ్యుమ్ అనే యువకుడు కొట్టుకుని పోతుండగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, చిన్నప్పన్న ఎం.అమ్మోరు, చందు, సతీష్, డి.కార్తీక్, రాజు గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. తమలో ఒకరికి ప్రాణాపాయం తప్పడంతో స్నేహితులందరూ ఊపిరి పీల్చుకున్నారు. వీరికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

పాలిసెట్ కోచింగ్‌కు విశేష స్పందన


కంచరపాలెం పాలిటెక్‌లో ఉచిత కోచింగ్ రిజిస్ట్రేషన్‌కు క్యూకట్టిన విద్యార్థులు

మురళీనగర్: పదో తరగతి అనంతరం సాంకేతిక విద్యనభ్యసించేందుకు పాలిటెక్‌లో ప్రవేశానికి సంబంధించి ఏప్రిల్‌లో నిర్వహించనున్న పాలిసెట్ ఉచిత కోచింగ్‌లో చేరేందుకు విద్యార్థులు తరలివస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఉచిత శిక్షణ తరగతులు ఏప్రిల్ 1 నుంచి నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. విశాఖ జిల్లాలోని కంచరపాలెం, పెందుర్తి, భీమిలి బాలికల ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీల్లో ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయి. ఈమేరకు నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియకు విశేష స్పందన లభిస్తోంది. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో శిక్షణ తరగతుల్లో చేరడానికి అత్యధిక సంఖ్యలో శనివారం విద్యార్థులు తరలివచ్చారు. వీరు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి చేరుకుని తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారు. శనివారం ఒక్క రోజే 50 మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉచితంగా శిక్షణ ఇస్తామని, ఇందుకు అవసరమైన తరగతి గదులు, అధ్యాపకులను కేటాయించామని ఆయన చెప్పారు.